https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 | సంచిక:22 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | సోమవారం, సెప్టెంబర్ 06,2026



### జోగు రామన్న అరెస్ట్..

# ఆదిలాబాద్‌లో ఉద్రిక్తత

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్ కు నిరసనగా ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన**

**జోగు రామన్న నేతృత్వంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా**


**అరెస్టులకు భయపడేదే లేదన్న జోగు రామన్న**

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ... మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ రాస్తారోకో చేపట్టాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాయి. సమాచారం అందుకున్న పోలీసులు జోగు రామన్నతో పాటు ఇతర నేతలను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా... బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది.జోగు రామన్నను అరెస్టు చేసి వాహనంలోకి తరలిస్తుండగా, బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనానికి అడ్డంగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు. పోలీసులు శ్రేణులను పక్కకు నెట్టి వాహనాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు యత్నించినా పలుమార్లు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన

# యూపీ సీఎం



**నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం**

- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు.అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు.అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు.మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

# కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్**

- ▶▶ తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం
- ▶▶ ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- ▶▶ స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- ▶▶ బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు.బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు.మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.



# వీరేంద్రకు మానవ హక్కుల కమిటీ బాధ్యతలు

హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, ట్రైనేట్ న్యూస్ సెప్టెంబరు 7 :

దిల్‌సుఖ్‌నగర్‌లో ఈరోజు జరిగిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో యూత్ వింగ్‌కు చెందిన సుమారు 35 మంది సభ్యులకు ఐడీ కార్డులు, సర్టిఫికెట్లను నేషనల్ ప్రెసిడెంట్ కటకం శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రెజరర్ రజినీష్, నేషనల్ అడ్వైజర్ లక్ష్మి సౌజన్య, లీగల్ అడ్వైజర్ భానుమూర్తి, నేషనల్ సేవాదళ్ వైస్ చైర్మన్ దివ్య గౌడ్, తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉత్తమ్ కుమార్తో పాటు యూత్ టీం సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా యూత్ జుజ సభ్యుడిగా గాలం వీరేంద్ర బాబుకు సర్టిఫికెట్, ఐడీ కార్డు అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ, ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేస్తానని వీరేంద్ర తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ IHRCI తరపున శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

### ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

**ఆటో ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలం కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపు అమలు**

**లాస్ట్ మైల్ కనెక్టివిటీ లో భాగంగా ఆర్టీసీ ఈవీ ఆటో లు నడిపే ప్రసక్తే లేదు ఇది దుష్ప్రచారం మాత్రమే**

**ఓలా, ఉబెర్ తరహా లో ప్రభుత్వమే యాప్ ప్రవేశపెట్టడానికి ఐటీ శాఖ తో సంప్రదింపులు జరిపాం**

**హైదరాబాద్‌లో 18,700 ఆటోలకు రెట్రోఫిట్మెంట్ కోసం రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం**

**ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి శాసన సభ లో బిల్లు ప్రవేశపెడతాం - ఆటో కార్మిక సంఘాల సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి**



హైదరాబాద్, ట్రైనెట్, సెప్టెంబర్ 7:

రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి కీలక సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘాలు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా.. ఆయా అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు.

**సమావేశంలో కీలక నిర్ణయాలు, అంశాలు**

**ఈవీ ఆటోలపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు**

టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు.

**ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు**

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఆటో ఛార్జీల పెంపునకు సానుకూల నిర్ణయం**

2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆటో ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని చెప్పారు. ఎంత మేర ఛార్జీలు పెంచాలనే అంశాన్ని కమిటీ నిర్ణయించి ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపును అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

**ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వ ప్రత్యేక యాప్**

ఆటో డ్రైవర్లకు ఉపయోగపడేలా ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించే అంశంపై ఇప్పటికే ఐటీ శాఖ మంత్రికి లేఖ రాశామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

# తాతా మధును బర్తరఫ్ చేయాలి,

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు తాతా మధుపై ఆరోపణలు

మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామన్న మహేశ్వర్ రెడ్డి

22-ఏ అక్రమాలపై పొంగులేటి క్షమాపణ చెప్పాలని డిమాండ్

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరపున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# స్పీకర్ నుంచి ఏమైనా ఆదేశాలున్నాయో మాకు చెప్పాలే : ఎమ్మెల్యే కేపీ వివేకానంద

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం కూడా బ్లాక్ టీషర్టులతో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాస్వామిక పద్ధతిలో పొందుపరుచుకుని.. లోపలికి వెళ్లేటప్పుడు ఈ రోజు జరిగిన సంఘటనలు జరిగిన దాష్టీకాలు, దాడులను చూస్తుంటే ఈ దాడి ముఖ్యమంత్రి ప్రణాళిక ప్రకారమే చేయించారని చాలా స్పష్టంగా అర్థమవుతోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసులంతా కూడా ఆదేశించి మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై దాడి చేయించినట్టు స్పష్టంగా.. కండ్లకు కట్టినట్టు కనబడుతోందన్నారు. ఈ రోజు ఎప్పుడు కూడా శాసనసభ చరిత్రలో ఇన్ని సంవత్సరాల్లో ఉమ్మడి రాష్ట్రంలో కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత కానీ మెయిన్ గేట్ దగ్గర ఎప్పుడున్నా సరే పార్కింగ్ దగ్గర కార్లు ఆపిన తర్వాత అక్కడున్నటువంటి పోలీసులు చెక్ చేసి ఏమైనా ఇబ్బంది ఉంటే లోపలికి పంపించి చీఫ్ మార్షల్ మాట్లాడిన తర్వాత ఏమైనా ఇబ్బంది ఉంటే స్పీకర్ మాట్లాడిన తర్వాతనే ఏదైనా చర్య ఉంటది తప్ప గేటు దగ్గర ఆపేసి దాడి చేసే విధంగా.. లోపలికే పోనీయం అనే విధంగా.. అంటే మా శాసన సభ ప్రజలతో ఎన్నుకోబడి అధికారికంగా అసెంబ్లీలో అడుగుపెట్టేటటువంటి సర్వాధికారాలుండి పోలీసులతో ఇబ్బంది పడుతున్నమంటే రాష్ట్రంలో ఏ రకమైన పరిపాలన సాగుతుంది.. ఎలాంటి అరాచక పాలన సాగుతుందో క్లియర్‌గా కండ్లకు కట్టినట్టుగా కనిపించిందన్నారు కేపీ వివేకానంద.



# రన్‌వే నుంచి దూసుకెళ్లిన కార్గో విమానం.. అయిదుగురు మృతి

మియామి: ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7

అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో .. అమెజాన్ కార్గో విమానం కూలింది. రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఆ విమానం పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అయిదురు మృతిచెందారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రన్‌వేపై దిగిన తర్వాత ఆ విమానం సమీపంలో పార్క్ చేసిన కార్ల వైపు దూసుకెళ్లిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బోయింగ్ 767-300 కార్గో విమానం ప్యూర్టో రికాలోని లూయిస్ మునోజ్ మారిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. అయితే ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు అమెజాన్ సంస్థ పేర్కొన్నది. స్థానిక అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. క్రాష్ సైట్ వద్ద దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ విమానాశ్రయంలో అన్నివిమానాలను గ్రౌండ్ చేస్తూ ఫెడరల్ ఏవియేషన్ శాఖ ఆదేశాలు ఇచ్చింది.అయితే చనిపోయిన వ్యక్తులు విమానంలో వారా లేక గ్రౌండ్‌పై ఉన్నవారు మృతిచెందారా ఇంకా తెలియదు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే రెస్క్యూ బృందం అక్కడకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయిదుగురిలో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు మియామి ఫైర్ చీఫ్ రాయిద్ జదల్లా తెలిపారు. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నది. 200 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పారు. కానీ విమానం నుంచి ప్యూయల్ లీక్ అవుతున్నట్లు చెబుతున్నారు.



# అసెంబ్లీలో ఊహించని పరిణామం..

## కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

- అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7



తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

# విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ అసెంబ్లీ ముట్టడి..

భరత్ గౌడ్ నాయకత్వంలో నిరసన.. భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు..

నాయకులు, కార్యకర్తల అరెస్ట్.. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలింపు..

సికింద్రాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7 :

విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ భరత్ గౌడ్ నాయకత్వంలో బీజేపీ శ్రేణులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ నిరసనలో జిల్లా నాయకులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం బీజేపీ శ్రేణులు నిరసన కొనసాగించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్, నందు, హరి, గడ్డం నవీన్, శారద, తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

## సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్.

హైదరాబాద్ ట్రైన్ నైట్ న్యూస్‌సికింద్రాబాద్, సెప్టెంబర్ 7:

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రెండో దశ కార్యక్రమాన్ని మెట్టుగూడలో నిర్వహించారు. మెట్టుగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హులైన వారికి ఫారం-6 అందజేశారు. కొత్త ఓటర్లు ఫారం-6ను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా ర్యాల రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యంలో ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేని యువత, కొత్త ఓటర్లు ఫారం-6 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొహద్ సాజిద్, కాటినీడి నాగరాజు, అబ్దుల్ మన్నాన్, మహి, పృథ్వీరాజ్, మహిళా నాయకురాళ్లు రూత్ క్లారి, కస్తూరి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.



# ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు: సబితా ఇంద్రారెడ్డి



మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత

కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన

హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు

ట్రైన్ నైట్ న్యూస్ సెప్టెంబర్ 7

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం... నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.